

# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

14 బుధవారం అక్టోబర్ 2026 పేజీలు: 3


## గణేష్ నగర్‌లో అన్నదాన కార్యక్రమం



మిర్యాలగూడ-అక్టోబర్ 13 (సత్య నిష్ఠ): మిర్యాలగూడ గణేష్ నగర్ దుర్గా నవరాత్రుల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. భక్తులు తక్కువ రావడంతో సుమారు 100 కేజీల భోజనం మరియు కూరలు మిగిలాయి అని దుర్గా నగర్ మణికి సమాచారం ఇవ్వగా, వారు వెంటనే మా నెంబర్ ఇచ్చారు. వెంటనే మొహమ్మద్ రహమత్ టాటా ఏసీ వాహనంలో వెళ్లి భోజనాన్ని తీసుకువచ్చి జంగాల కాలనీలో అవసరం ఉన్నవారికి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కడి యువకులు కూడా పాల్గొన్నారు. భోజనం వృధా కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా మాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదములు. మొహమ్మద్ పర్వేజ్ హుస్సేన్, ఫౌండర్ & చైర్మన్, ఫాతిమా ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ సొసైటీ పాల్గొన్నారు.

## అనాథ, వికలాంగుల పిల్లల మధ్య చిన్నారి లక్ష్మీ వేదస్య పుట్టినరోజు వేడుకలు

- కేక్ కట్ చేసి, అన్నదానం చేసిన తల్లిదండ్రులు శ్రీనివాస్, సంధ్య దంపతులు



కోదాడ - అక్టోబర్ 13 (సత్యనిష్ఠ) వేడుకల పేరిట డబ్బు వృథా చేయకుండా తోటి వారికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయడమే నిజమైన వేడుక అని కోదాడ పట్టణాని కి చెందిన శ్రీనివాస్, సంధ్య దంపతులు నిరూపించారు. తమ కుమార్తె లక్ష్మీ వేదస్య నాలుగో పుట్టిన రోజును పురస్కరించుకుని వారు మంగళవారం కోదాడ పట్టణం లోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల ఆశ్రమం లో అనాథ, మానసిక వికలాంగుల పిల్లల మధ్య చిన్నారి లక్ష్మీ వేదస్య తో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను అత్యంత ఘనంగా జరుపు కున్నారు. అనంతరం ఆశ్రమం లోని పిల్లలందరికీ రుచి కరమైన భోజనాన్ని వడ్డించి అన్నదానం చేశారు. పుట్టిన రోజు వేడుకలను వికలాంగుల పిల్లల మధ్య జరుపు కోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు మంగమ్మ, గురుమూర్తి, విజయలక్ష్మి, అరుణ, నవీన్, మనూష ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సమస్యను పరిష్కరించాలి



కోదాడ - అక్టోబర్ 13 (సత్యనిష్ఠ) నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం సబ్ స్టేషన్ పరిధి లో ఎక్కువ ఫీడర్ చానల్స్ ఉండటం వల్ల రైతుల కు నాణ్యమైన విద్యుత్తు అందించలేక పోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఈ సమస్య అధిగ మించుటకు గాను రామాపురం ఈకే పేట, ఈకే పేట తండా ఈ మూడు గ్రామాల కు కలిపి నూతనంగా రామాపురం పరిధి లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి రైతుల కు లో వోల్టేజ్ సమస్యను మరియు నాణ్యమైన విద్యుత్తు ను అందించుటకు ఎంతగానో తోడ్పడుతుంది. ఈ ప్రతిపాదనను ఈ మూడు గ్రామ ప్రజల ప్రజా ప్రతినిధులతో పాటు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేపూరి తిరపమ్మ సుధీర్, రామాపురం సర్పంచ్ బూత్కూరు వెంకట్ రెడ్డి నాయకత్వంలోఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించే ందుకు నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు ప్రయత్నించా లని రైతుల తరఫున అభ్యుదయ రైతు మారిశెట్టి నరసింహారావు ఎక్స్ పిఏసిఎస్ డైరెక్టర్ రామాపురం అభ్యుదయ రైతు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదం తో ముందు కెళ్లాలని పిలుపు నిచ్చారు.

## అర్హులైన గీత కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

- సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్ గౌడ్
- సొసైటీలకు రూ.1000 కోట్ల నిధి కేటాయించాలి
- గీత కార్మికులకు పింఛన్ రూ.5000కు పెంచాలి




మర్రిగూడ (సత్యనిష్ఠ): అర్హులైన గీత కార్మికులందరికీ తక్షణమే లైసెన్సులు మరియు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని గీత పనివారల సంఘం నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గీత కార్మికుల సంక్షేమానికి, సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం రూ. 1000 కోట్ల నిధిని కేటాయించాలని కోరారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే ఒక ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

**నిబంధనలు లేని పింఛన్, బీమా ప్రీమియం విడుదల చేయాలి**

సంఘం మండల గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ మాధ సత్యం మాట్లాడుతూ... ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న గీత కార్మికులకు ఇచ్చే పింఛన్‌ను రూ. 5,000 కు పెంచాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన గీతా కార్మికుల ప్రమాద బీమా ప్రీమియంను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రతి గీత కార్మికుడికి ప్రాణరక్షణ కోసం ఉచితంగా సేఫ్టీ కిట్లు అందించాలని కోరారు. సిపిఐ (CPI) మర్రిగూడ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ మాట్లాడుతూ... గీత కార్మికులకు ఎలాంటి షరతులు, నిబంధనలు విధించకుండా పింఛన్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశం లో గీత పనివారల సంఘం నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య రాయపూడి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం

- దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పేదలకు అన్నదానం



కోదాడ - అక్టోబర్ 13 (సత్యనిష్ఠ) ?దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్క రించుకుని కోదాడ పట్టణం లోని రంగా థియేటర్ లో ఆర్యవైశ్య, రాయపూడి మిత్ర మండలి ఆధ్వర్యం లో మంగళవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండగ వేళ పేదలకు ఆకలి తీర్చేలా ఈ సేవా కార్యక్రమం చేపట్టడం పట్ల ఆర్యవైశ్య మిత్రమండలి సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిత్ర మండలి సభ్యులు మాట్లాడుతూ నవ రాత్రుల వేళ అమ్మ వారి ఆశీస్సుల తో నిరు పేదలకు, బాటసారులకు అన్నదానం అంద జేయడం ఎంతో ఆనందదాయక మని తెలిపారు. పట్టణం లోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్య లో తరలివచ్చిన పేదలు ఈ అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్ పాశం శ్రీను, ఒరుగంటి ప్రభాకర్, గరినే కోటేశ్వర రావు, రాయపూడి వెంకట నారాయణ, ఇమ్మడి సతీష్ బాబు, పబ్బ గీత, శ్రీనివాస రావు, బెలిదే అశోక్, బండారు శ్రీనివాస రావు, బ్రహ్మానందం, బూరెల కరుణాకర్, వెంపటి వెంకట రమణ, లక్ష్మణ్, చల్లా విజయ శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సరుకుల పంపిణీ టెండర్లను స్థానిక మహిళా సంఘాలకు ఇవ్వాలి

- నాకాఫ్ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



నల్లగొండ-అక్టోబర్ 13 (సత్య నిష్ఠ): తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్లను స్థానిక మహిళా సంఘాలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం పిలిచిన కేంద్రీకృత టెండర్లలో భారీ అక్రమాలు చేటు చేసుకున్నాయని లింగం గౌడ్ ఆరోపించారు. గత ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన నాకాఫ్ ను మళ్లీ అదే సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కమిషన్లు తీసుకొని అనుభవం లేని వారికి సబ్ కాంట్రాక్టులు ఇచ్చిందని అధికారులందరూ మామూళ్ల మత్తులో తూగుతున్నారని విమర్శించారు.

## కొండూరులో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- అంగరంగ వైభవంగా అన్నప్రసాద వితరణ
- అన్నప్రసాద దాత: కొడాల ఆల్వాల్ రెడ్డి



**మర్రిగూడ-సత్యనిష్ఠ :** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కొండూరు గ్రామంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నవరాత్రి ఉత్సవాల శుభ సందర్భంగా మంగళవారం సాయంత్రం గ్రామంలోని భక్తులకు, ప్రజలకు భారీ అన్నదాన (అన్నప్రసాద) కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి నవరాత్రులు, బతుకమ్మ మరియు విజయదశమి (దసరా) పండుగల శుభాకాంక్షలు తెలుపుతూ ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని కొడాల ఆల్వాల్ రెడ్డి విరాళంగా (దాతగా) అందించారు. సాయంత్రం 7:00 గంటల నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని దుర్గాదేవి అమ్మవారి దర్శనం చేసుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దాత కొడాల ఆల్వాల్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు కొండూరు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామంలోని ప్రతీ ఇల్లు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# ఎస్.ఐ.ఆర్ రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- నల్గొండ నాగయ్య, డి రవి పివైఎల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు



**కోదాడ - అక్టోబర్ 13 (సత్యనిష్ఠ)** ఎస్.ఐ.ఆర్ ను రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పి డి ఎస్ యు, పి వై ఎల్ ఆధ్వర్యంలో 15న జరిగే ఎలక్షన్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్గొండ నాగయ్య, డి రవి పిలుపు నిచ్చారు. స్థానిక లాల్ బంగ్లా లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. మూడో విడత ముసాయిదా ఓటరు జాబితాలు విడుదలయ్యే నాటికి దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ప్రజల పేర్లు ఓటరు జాబితాల నుంచి తొలగించబడ్డట్లు తెలిసిన విషయమే తెలంగాణ రాష్ట్రంలో కూడా సుమారు 73 లక్షల 39 వేల ఓట్లను తొలగించినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. బిజెపియేతర రాష్ట్రాలలో ఓట్లను తొలగించడం జరుగుతుందని అన్నారు. తొలగించిన ఓట్లకు బాధ్యత వహిస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా గత నెల రోజులుగా విద్యార్థి, యువత రోడ్లపై కొచ్చి ఉద్యమాలు నిర్వహిస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని అన్నారు. అక్టోబర్ 10 వ తారీఖున ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి సిద్ధమైన ఉద్యమకారులను అణిచివేయడం కోసం దేశ నగరమైన ఢిల్లీలో ఉన్న సుమారు 45 మెట్రో రైల్వే స్టేషన్లను మూసివేస్తూ నిత్యవసర రవాణాలను కూడా నిలిపివేసి ప్రభుత్వం యొక్క మొండి వైఖరిని మరోసారి దేశానికి తెలియజేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే 237 రైళ్ల రాకపోకలను నిలిపివేయడం అంటే ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ఓటు హక్కును కాలరయటమంటే భారత రాజ్యాంగంపై పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం దాడి నిర్వహిస్తుందని మండిపడ్డారు. ఓట్లను కోల్పోయిన జాబితాలో ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, మైనార్టీలు, మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న వారి యొక్క ఓట్లనే తొలగించడం అంటే ప్రభుత్వం ఈ వర్గాల ప్రజల ఓటు హక్కును కుట్రపూరితంగా తొలగించిందని అన్నారు. చనిపోయిన వారిని మినహాయించి తొలగించిన ఓట్లన్నీ పునరుద్ధరించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తున్న ఎన్నికల విధానాన్ని సంస్కరించాలి, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత ఉండాలి, ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని, ఎస్.ఐ.ఆర్ ను రద్దు చేయాలని, చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ముట్టడికి విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వి రమేష్, జిల్లా కోశాధికారి బండి రవి, జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, మున్నా అశోక్, పొన్నం బ్రహ్మం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేతిరెడ్డి వాసుదేవ రెడ్డికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్



**నల్లగొండ-అక్టోబర్ 13( సత్యనిష్ఠ):** తెలంగాణ ఉద్యమ కెరటం మాజీ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టబద్దలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరఫున తెలంగాణ విద్యార్థి ఉద్యమ కెరటం నిగర్వి నిరాడంబర సేవా తత్పరచకు మారుపేరైన డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బి ఆర్ ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావుకు మాజీ మంత్రి హరీష్ రావుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక ఉద్యమంలో ఆనాడు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి కీలక పాత్ర పోషించారని వికలాంగులు అయినప్పటికీ తన శారీరక పరిమితులను అధిగమించి సకలాంగులతో దీటుగా ఉద్యమంలో పాల్గొన్నారు కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడపడంతో పాటు అనేక ఉద్యమ సంఘాలకు చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థులను తెలంగాణ ఉద్యమం వైపు నడిపించి ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు సుమారు 100 కేసులు నమోదు చేసినప్పటికీ భయపడకుండా వెనకడుగు వేయకుండా నాటు ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని పోలీసు నిర్బంధాలు విధించిన అన్నింటిని అధిగమించి కేసీఆర్ ఉద్యమ సమయంలో ఏ పిలుపు ఇచ్చిన ఆయన ఆజ్ఞలను ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి కెసిఆర్ అడుగుజాడల్లో తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా యూనివర్సిటీలో ఉద్యమాన్ని ముందుండి నడిపించిన పోరాటయోధులు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి శాసనమండలికి పంపాలని వాసుదేవ రెడ్డి లాంటి ఉద్యమ నాయకుడికి అవకాశం ఇవ్వడం వల్ల దేశానికి స్వతంత్రం వచ్చిన 80 సంవత్సరాల నుండి రాజ్యాధికారానికి దూరమైన వికలాంగులకు రాజకీయ అవకాశాలు కల్పించిన పార్టీగా తెలంగాణ రాష్ట్ర సమితి నిలబడుతుందని ఉద్యమంలో కష్టనష్టాలను ఎదుర్కొని రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడికి తగిన రాజకీయ గుర్తింపు ఇచ్చిన పార్టీగా భారత రాష్ట్ర సమితి నిలుస్తుందని ఆయన రాష్ట్రంలో ఉన్న ఇతర రాజకీయ పార్టీలు కూడా వికలాంగులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని ముఖ్యంగా జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ బిజెపిలో వారి పార్టీలను వికలాంగుల విభాగంలో పనిచేస్తున్న వికలాంగులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృషిత్ మియా సంఘం నాయకులు ఇటుకల వెంకట్ డబ్బులు లక్ష్మారెడ్డి ఎర్రోళ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# చెన్నకేశవపురంలో నిమ్మ తోటలపై సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

**కోదాడ – అక్టోబర్ 13 (సత్యనిష్ఠ)** కోదాడ నియోజక వర్గ పరిధి లోని నడిగూడెం మండలం చెన్న కేశవపురం, గ్రామంలో రైతు తంగెళ్ల చంద్రయ్య నిమ్మ తోటలో శ్రీ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యం లో నిమ్మ తోటల పై సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ అధ్యక్షత వహించగా, జిల్లా ఉద్యాన శాఖాధికారి టీ. నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారి మల్సూర్, ఉద్యాన శాఖ అధికారి అనిత, ఉద్యాన విస్తరణ అధికారి అనిల్, శ్రీ ఫౌండేషన్ ప్రతినిధి ఎం. గోపి, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీ సీహెచ్. నరేష్, శ్రీ ఎ. కిరణ్, రైతులు అర్జున్ రావు, మేకల గోవర్ధన్, మేకల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ సీహెచ్. నరేష్ మాట్లాడుతూ, నిమ్మ తోటల్లో అధిక దిగుబడులు, నాణ్యమైన పండ్లు పొందాలంటే సమతుల్య ఎరువుల యాజమాన్యం, సరైన నీటి యాజమాన్యం, సకాలంలో కొమ్మల కత్తిరింపు, కలుపు నివారణ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను



పాటించాలని సూచించారు. మొక్కల వయస్సు, నేల స్వభావం, పంట స్థితిని బట్టి ఎరువులు, సూక్ష్మపోషకాలను సిఫార్సుల మేరకు అందించాలని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీ ఎ. కిరణ్ మాట్లాడుతూ, నిమ్మలో సిట్రస్ లీఫ్ మైనర్, సిట్రస్ సిల్లా, పండు తొలుచు ఈగలు, పొలుసు పురుగులు, పేనుబంక వంటి పురుగులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఆకులపై మచ్చలు, కొమ్మలు ఎండిపోవడం, పండ్లపై గాయాలు, ఆకులు ముడుచుకోవడం వంటి లక్షణాలను గుర్తించి, సమస్య తీవ్రతను బట్టి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. గుమ్మటపు తెగులు, కొమ్మ ఎండు తెగులు, వేరుకుళ్ళ వంటి సమస్యల నివారణకు తోటలో నీరు నిల్వ ఉండకుండా చూడటం, ఎండిన కొమ్మలను తొలగించడం, పనిముట్లను శుభ్రపరచడం, తోట పరిశుభ్రత పాటించడం ముఖ్యమని వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, తోటలో నీరు నిల్వ ఉండకుండా తగిన మురుగు నీటి పారుదల సౌకర్యం కల్పించాలని, నేలలో తేమను బట్టి నీటిని అందించాలని, మొక్కల మొదళ్ల వద్ద అధిక తేమ పేరుకుపోకుండా చూడాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎండిన, వ్యాధి సోకిన కొమ్మలను తొలగించి తోట బయట నాశనం చేయాలని, కలుపు మొక్కలను నియంత్రించాలని, పురుగులు మరియు తెగుళ్ల లక్షణాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. అదేవిధంగా, నిమ్మలో అరగుల యాజమాన్యం (పంట కొమ్మల నిర్వహణ, కత్తిరింపు మరియు తోట ఆకృతి నిర్వహణ) సక్రమంగా చేపట్టడం ద్వారా గాలి, సూర్యరశ్మి ప్రసరణ మెరుగుపడి, మొక్కల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. పంటకు అవసరమైన పోషకాలను నేల పరీక్ష ఆధారంగా అందించాలని, పూత, కాయ అభివృద్ధి దశల్లో నీటి ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురుగుమందులు, శిలీంద్రనాశకాలను సమస్యను నిర్ధారించిన తర్వాత మాత్రమే, సిఫార్సు చేసిన మోతాదుల్లో, లేబుల్ సూచనలు మరియు భద్రతా జాగ్రత్తలను పాటిస్తూ వినియోగించాలని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు రైతులతో కలిసి నిమ్మ తోటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురుగులు, తెగుళ్ళు, పోషక లోపాలు, మొక్కల పెరుగుదలకు సంబంధించిన సమస్యలను చర్చించారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి, తోట పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా నిమ్మ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పురుగులు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలను తగ్గించడం, నాణ్యమైన దిగుబడులు సాధించడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నల్గొండలో 33 కేవీ బ్రేకర్ వద్ద పేలుడు

### విద్యుత్ సరఫరాకు అంతరాయం



**నల్గొండ–అక్టోబర్ 13( సత్య నిష్ట):** నల్గొండ పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మంగళవారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. మమిళ్లగూడెం 33 కేవీ బ్రేకర్ వద్ద కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) ఒక్కసారిగా పేలింది.భారీ శబ్దంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో విద్యుత్ సరఫరా వ్యవస్థ నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు చర్యలు ప్రారంభించారు. ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్

- **3 కొత్త ఆర్‌వోబీలు, 'పర్వతమాల'ద్వారా 5 రోప్‌వేలకు ఆమోదం**
- **హైదరాబాద్--శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై డీపీఆర్ తయారీకి ఆదేశం**
- **కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి భేటీ**
- **కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపనకు సమ్మతి.. 'ఇండియన్ రోడ్ కాంగ్రెస్'కు గడ్కరీకి ఆహ్వానం**

**న్యూఢిల్లీ–అక్టోబర్ 13(సత్యనిష్ట):** తెలంగాణలో కీలక మౌలిక వసతుల కల్పన, జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ ఊతం లభించింది. రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పలు పెండింగ్ ప్రాజెక్టులు, ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త రహదారుల నిర్మాణాలపై చర్చించారు.




మంత్రి కోమటిరెడ్డి చేసిన కీలక ప్రతిపాదనలకు గడ్కరీ తక్షణ ఆమోదం తెలపడంతో పాటు మరికొన్నింటిపై సానుకూలంగా స్పందించారు.

**హైవే పనుల్లో వేగం...**

హైదరాబాద్ నగర ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఎల్బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర మంత్రి గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతోపాటు ఎన్‌హెచ్--65 పరిధిలోని హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపై సానుకూలత వ్యక్తం చేశారు. హైదరాబాద్--శ్రీశైలం (ఎన్‌హెచ్--765) మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలన్న విజ్ఞప్తిపై స్పందిస్తూ తక్షణమే కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు.

**కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి, 5 రోప్‌వేలు...**

ఎన్‌హెచ్--167కె పరిధిలో కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుతో తెలంగాణ, ఏపీ మధ్య రవాణా వ్యవస్థ సులభతరం అవుతుంది. పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి చెందనుంది. పర్వతమాల పథకం కింద తెలంగాణలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక?మక ప్రాంతాలకు ఉపయోగపడేలా 5 రోప్‌వేల నిర్మాణానికి గడ్కరీ ఆమోదముద్ర వేశారు. అలాగే కేంద్ర రోడ్డు మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) పరిధిలోని సేతు బంధన్ పథకం కింద 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జీల (ఆర్‌వోబీల) నిర్మాణానికి ఆమోదం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ రోడ్డుపై 4 లేన్ల ఆర్‌వోబీ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్ స్థానంలో 2 లేన్ల ఆర్‌వోబీ, నల్లగొండ జిల్లా దామరచర్ల--వీరలపాలెం రోడ్డుపై 4 లేన్ల ఆర్‌వోబీ సాకారం కానున్నాయి.